# సాక్షి
## అనకాపల్లి

శుక్రవారం । 5 । జూలై । 2024




### ఏయూకు పుస్తకాల బహూకరణ

విశాఖ: ఏయూ లైబ్రరీకి ఆస్ట్రేలియా తొలితరం రచయిత వి.ఎస్.ఊటుకూరి తెలుగు పాటలపై పరిశోధనాత్మక పుస్తకాలను అందించారు.



### వెండి పాదుకలకు విరాళం

విశాఖ: పీలానగర్‌లోని తిరుమల బాలాజీ కోసం వంకినేని పిచ్చయ్య చౌదరి దంపతులు వెండి పాదుకలు అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/27.0

### వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

# పుడమికి జీవం.. పైరుకు ప్రాణం

నేల సారాన్ని పెంచడానికి లేదా మొక్కలకు పోషకాలను అందించడానికి జీవ ఎరువులు ప్రధానం.. వీటితో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ.. రైతుకు పెట్టుబడులు భారం లేకుండా అధిక దిగుబడి పొందవచ్చు. ఇవి పొడి, ద్రవ రూపంలో అన్ని రకాల పంటలకు వాడవచ్చు. అతి తక్కువ ధరకు అందించేందుకు ఆర్‌ఏఆర్‌ఎస్ అందుబాటులోకి తీసుకొచ్చింది.



- జీవ ఎరువులతో అధిక దిగుబడి
- తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఆర్‌ఏఆర్‌ఎస్
- మొక్కల పెరుగుదలకు పోషకాలు, హార్మోన్లు
- 25 శాతం వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గుదల
- ఆర్బీకేల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు



జీవ ఎరువులు



జీవ ఎరువులు

సాక్షి, అనకాపల్లి: జీవ ఎరువుల తయారీ కేంద్రాలను అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ (ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం) ఏర్పాటు చేసింది. వీటి వినియోగంతో ఒక వైపు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు మరోవైపు రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. జీవ ఎరువుల్లో ప్రధానంగా నత్రజని, భాస్వరం, పోటాషియం, జింక్‌లు లభ్యమవుతాయి. రైతులకు వీటి వినియోగం, కలిగే ఉపయోగాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

**మొక్కలకు పోషకాలు..**

జీవ ఎరువులనేవి మొక్కలకు పోషక పదార్థాలను, మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చుతోంది. వాతావరణంలో చాలా మొత్తంలో (78 శాతం) నత్రజని ఉంటుంది. వాటిని మొక్కలు సంగ్రహించలేని పరిస్థితిలో ఉంటాయి. జీవ ఎరువుల ద్వారా మొక్కలో ఉండాల్సిన నత్రజనిని అందించడం, అదేవిధంగా నేలలో మొక్క తీసుకోలేని భాస్వరం, పొటాషియం ఎరువులను అందిస్తాయి. నత్రజని స్థిరీకరించే జీవ ఎరువులు (నైట్రోజన్ ఫిక్సింగ్ బ్యాక్టీరియా), భాస్వరం అందించే జీవ ఎరువులు (ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా), పొటాషియం అందించే జీవ ఎరువులు (పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా), జింక్ అందించే జీవ ఎరువులు (జింక్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా)లన్నీ జీవ ఎరువుల్లో లభ్యమై ఉంటాయి.

**జీవ ఎరువులు వాడుకొనే విధానం...**

**1)రైజోబియం జీవ ఎరువులు...**

విత్తన శుద్ధిలో భాగంగా కిలో విత్తనాలను 10 గ్రాముల పొడి రూపంలో జీవ ఎరువు (లేదా) 10 మి.లీ. ద్రవరూప జీవ ఎరువులతో విత్తనశుద్ధి చేసుకోవాలి. 200 గ్రాముల రైజోబియం జీవ ఎరువును ఎకరా పొలానికి కావాల్సిన విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి చేయడానికి 50 గ్రాముల బెల్లం లేదా పంచదార లేదా గంబీ పౌడర్‌ను కలిపి 10 -15 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. ఈ ద్రావణాన్ని ఎకరానికి కావాల్సిన విత్తనంపై చల్లి దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టూ పొరల ఏర్పడేటట్లు చూడాలి. కల్చర్ పట్టించిన విత్తనాన్ని నీడలో ఆరబెట్టి వెంటనే విత్తుకోవాలి. ఈ రైజోబియం జీవ ఎరువులను పంట మార్పిడి పద్ధతిలోను, అధిక ఆమ్ల/క్షార భూములలోను, మురుగు నీరు నిల్వ ఉన్నప్పుడు, అధిక ఉష్ణోగ్రత ప్రాంతాలలో వినియోగించాలి. విత్తన శుద్ధి చేసుకోవడం వీలుకానప్పుడు నాటే ముందు ఎకరానికి రెండు కిలోల కల్చర్ ఎరువులో కలుపుకొని వాడుకోవచ్చు.

**2) అజోస్పైరిల్లమ్,**

అజోటోబాక్టర్, ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా జీవ ఎరువులను విత్తన శుద్ధి, నారుమడి/దుంప శుద్ధి, నేలపై వెదజల్లుట ద్వారా వినియోగించుకోవచ్చును. విత్తనశుద్ధిలో కిలో విత్తనానికి 10 గ్రాముల కల్చర్ వాడుకోవాలి. నారుమడి శుద్ధిలో 100 లీటర్ల నీటిలో కిలో జీవ ఎరువులను కలుపుకొని ఎకరానికి సరిపడు నారు, దుంప వేర్లను ఈ ద్రావణంలో 10-15 నిమిషాలు సేపు ఉంచి వేసుకొనే 3-4 రోజులు ముందు 2 కిలోల కల్చర్‌ను బాగా చివికిన 100 కిలోల పశువుల ఎరువులో కలుపుకొని, చల్లని ప్రదేశంలో పొరలా వేసుకొని గోనె సంచిలో కప్పుకోవాలి. నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.

**అజోటోబాక్టర్, అజోస్పైరిల్లమ్...**

సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉన్న నేలల్లో బాగా పని చేస్తుంది. కేవలం నత్రజని స్థిరీకరించడమే కాకుండా హార్మోన్లను, ఎంజైమ్లను విడుదల చేసి మొక్క ఏపుగా పెరగడానికి దోహదపడుతుంది. ఈ సూక్ష్మ జీవులు వేర్లతో సంబంధం లేకుండా స్వతంత్రంగా నేలలో జీవిస్తాయి. అజోస్పైరిల్లమ్ మొక్క వేర్లలోకి చొరబడి జీవిస్తాయి, స్థిరీకరించిన నత్రజని ఎక్కువ శాతం వేర్లు తీసుకొనే అవకాశం ఉంది.

**ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా**

పంటకు వేసిన భాస్వరం భూమిలో చేరిన కొద్ది రోజులలోనే మొక్కలకు కావాల్సిన హార్మోన్లను రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

**పొటాషియం....**

పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా(కేఆర్బీ) అనే జీవ ఎరువు భూమిలో మొక్కలకు అందుబాటులో లేని పొటాషియంను సమీకరించి అందుబాటులోకి తీసుకొస్తుంది. పొటాషియం లోపం ఉన్న నేలల్లో, పొటాషియం పోషకం ఎక్కువగా ఉపయోగపడే పంటలకు ఈ జీవ ఎరువు అనువైనది. ఈ జీవ ఎరువుతోనూ సేంద్రియ ఎరువు వాడాలి.

### జీవ ఎరువుల ఉపయోగాలు

- పంట దిగుబడులు 10-15 శాతం వరకు పెరుగుతాయి.
- రసాయన ఎరువుల వాడకాన్ని 20-25 శాతం దాక తగ్గించుకోవచ్చు.
- వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు.
- నేల భౌతిక లక్షణాలు మెరుగుబడి భూసారం పెరుగుతుంది.
- తక్కువ ధరలలో లభ్యమై, రైతులకు రసాయన ఎరువుల ఖర్చు తగ్గిస్తాయి.
- సూక్ష్మదాతు పోషక లోపాలు రాకుండా నివారిస్తాయి.
- హార్మోన్లు, విటమిన్లు మొక్కలకు లభ్యమయి ఆరోగ్యంగా పెరుగుదల జరుగుతుంది.
- నేల గుల్లబారి వేర్లు బాగా లోపలికి చొచ్చుకుపోయి పోషకాలు ఎక్కువ గ్రహించడానికి ఉపయోగపడతాయి.
- నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంత మేరకు అరికట్టవచ్చు. ఈ జీవ ఎరువులు అన్ని పంటలకు వాడుకోవచ్చు. ఇవి సమర్థవంతంగా జీవ ఎరువులతో తప్పనిసరిగా సేంద్రియ ఎరువును వాడాలి.

**జీవ ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- వీటిని రసాయన ఎరువులలో కలిపి వాడకూడదు. ఎండ తగలని చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.
- నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి
- జీవ ఎరువులను ప్యాకెట్‌పై ఉన్న గడువులోపే వాడాలి.
- నాణ్యత గల కల్చర్‌ను మాత్రమే వాడాలి.
- రసాయనాలతో విత్తనశుద్ధి చేసుకునేటప్పుడు విధిగా 24-28 గంటల వ్యవధి ఉండాలి
- నాణ్యత కలిగిన జీవ ఎరువులను ప్రభుత్వరంగ సంస్థలు లేదా నమ్మకమైన ప్రైవేటు సంస్థల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.

### రైతుకు లాభసాటిగా..



జీవ ఎరువులు వాడకం రైతుకు లాభసాటిగా ఉంటుంది. ఈ ఎరువును ఎలా ఉపయోగించాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తాం. ప్రతీ రైతుకు జీవ ఎరువుల ఉపయోగం తెలుసుకోవాలి. రైతుకు పెట్టుబడి భారం ఉండకూడదనే ఆర్‌ఏఆర్‌ఎస్ అందుబాటులోకి జీవ ఎరువులను తీసుకొచ్చాం.

– డాక్టర్ ముకుందరావు, ఏడీఆర్, ఆర్‌ఏఆర్‌ఎస్

# అల్లూరి త్యాగం అజరామరం



అల్లూరి సమాధికి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చిత్రంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు తదితరులు

- పర్యాటక ప్రాంతంగా అల్లూరి పార్కు అభివృద్ధి
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ఘనంగా సీతారామరాజు జయంతి వేడుక

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగఫలితమే మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఆయన అంత్యక్రియలు జరిగిన ఏఎల్‌పురం (కృష్ణదేవిపేట) గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి స్పీకర్ హాజరయ్యారు. అల్లూరి సీతారామరాజు, గంటందొరల సమాధులకు నివాళులర్పించిన అనంతరం అల్లూరి కాంస్య విగ్రహానికి పూలదండ వేశారు. మ్యూజియం వద్ద అల్లూరి సేవా సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన అనంతరం సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అల్లూరి దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అవుతుందన్నారు. అల్లూరి పార్కును అభివృద్ధి చేస్తామని, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. లంబసింగి నుంచి చింతపల్లి మీదుగా అల్లూరి పార్కుకు టూరిస్టులు వచ్చే విధంగా అధికారులు అభివృద్ధి చేయాలన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయమని సీఎం రమేష్‌ను కోరగా ఆయన అంగీకరించినట్టు తెలిపారు. యువత గంజాయికి అలవాటు పడి దారి తప్పుతున్నారని, పోలీస్ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. తల్లిదండ్రులు ఎంతో ఖర్చు పెట్టి పిల్లలను చదివించడమే కాదు, వారు హాస్టల్లో ఎలా ఉన్నారో నెలకు ఒకసారి వెళ్లి చూడాలని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జేసీ జాహ్నవి, డీపీవో శిరీషారాణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్డీవో జయరాం, క్షత్రియ సంఘం ప్రతినిధి గజపతిరాజు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో దహన ఖర్చు సాయం పెంపు

అనకాపల్లి: ప్రజా రవాణా వ్యవస్థ (ఆర్టీసీ)లో పదవీ విరమణ చేసి 2022 జనవరి 1వ తేదీ తర్వాత మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వం దహన ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేస్తుందని ఆర్టీసీ విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆళ్ల సాంబమూర్తి అప్పారావు, విత్తనాల పోతురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విశ్రాంత ఉద్యోగులు మృతి చెందితే రూ.15 వేలు అందజేశారని, తాజాగా మరో రూ.10 వేలు పెంచారని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లే తీసుకుని మంగళ, శుక్రవారాల్లో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9603358566, 9441362177 సంప్రదించాలన్నారు.

### న్యూస్‌రీల్

#### ప్రభుత్వ ఐటీఐలో 8న అప్రెంటిస్‌షిప్ మేళా

నర్సీపట్నం: ఈ నెల 8న ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. అన్ని ట్రేడ్‌లకు సంబంధించి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ, రాత పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా ఉంటుందన్నారు.

#### 12 నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

అనకాపల్లి: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను ఈనెల 12, 13, 14 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ కార్యదర్శి యల్లపు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు శుక్రవారం సాయంత్రంలోగా స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441149808 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

#### ఏయూ దూరవిద్య పరీక్షల దరఖాస్తు గడువు పెంపు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో పరీక్షల దరఖాస్తు, రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 10 తేదీ వరకు పొడిగించినట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.5 వేల అపరాధ రుసుముతో ఈ నెల 15వ తేదీ వరకు తత్కాల్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వీరికి విశాఖలో మాత్రమే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## బండారు ఎదుటే బయటపడ్డ బండారం

- దేవరాపల్లిలో టీడీపీ నాయకుల కుమ్ములాట
- పాత, వలస నేతల మధ్య ఆధిపత్య పోరు

దేవరాపల్లి: దేవరాపల్లి టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఆధిపత్య పోరుతో గురువారం కుమ్ములాటకు దిగారు. రైవాడ అతిథి గృహంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎదుటే బాహాబాహీకి దిగడం గమనార్హం. ఒకరిపై మరొకరు పరుష పదజాలంతో దుర్భాషలాడుతూ పరస్పరం దాడులు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే వీరి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన దేవరాపల్లికి చెందిన టీడీపీ నాయకుడిపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ మండల సమావేశం నిర్వహించి సదరు నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిసింది.

**వివాదం ఇలా....**

దేవరాపల్లిలో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వేరే పార్టీ నుంచి టీడీపీలోకి వలస వచ్చిన నాయకుడి తీరుతో వర్గ పోరు మొదలైంది. ఆ వలస నేత మండలంలో ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయత్నాలకు పాత నాయకులు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తుండటంతో విభేదాలు ముదిరాయి. ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో కూర్చొని పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన తమను అణగదొక్కేందుకు.. తాజాగా వలస వచ్చిన నేత కుట్రలు పన్నుతున్నారని పాత టీడీపీ నాయకులంతా గుర్రుగా ఉన్నారు. దేవరాపల్లిలో జలజీవన్ మిషన్ పథకంలో ఓ వీధికి ఇంటింటి కుళాయి పనులను సదరు వలస నేత అడ్డగింపజేశారని పాత టీడీపీ నాయకులు కొందరు గురువారం ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వలస నేత తనకు అనుకూలంగా ఉన్న పాత టీడీపీ కార్యకర్తను ఉసిగొల్పడంతో.. ఆయన రైవాడ అతిథి గృహానికి చేరుకొని ఎమ్మెల్యే ఎదుటనే ఇష్టానుసారం తిట్ల పురాణం మొదలుపెట్టాడు. దీంతో మండల టీడీపీ కీలక నాయకుడు సముదాయించే ప్రయత్నం చేశాడు. అయితే సముదాయించిన నాయకుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా కార్యకర్తపై మండల టీడీపీ నాయకుడు చేయి చేసుకున్నట్లు సమాచారం. వలస నేత ఉసిగొల్పడంతోనే సదరు కార్యకర్త ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించారని పాత టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ వివాదంపై చర్చించేందుకు శుక్రవారం పార్టీ మండల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## మరింత పటిష్టంగా నూతన చట్టాలు

- పోలీసులతోపాటు ప్రజలకు అవగాహన అవసరం
- డీఎస్పీ కేవీ సత్యనారాయణ



నూతన చట్టాలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ షేక్ గఫూర్, ఎస్సై పాపినాయుడు

యలమంచిలి రూరల్: నూతన చట్టాలపై పోలీసులతోపాటు సామాన్య ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. గురువారం యలమంచిలి పట్టణ పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన.. ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కోసం జిల్లా పోలీసు శాఖ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చట్టాల్లోని లోపాలను సవరించి, ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా పటిష్టంగా నూతన చట్టాల్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. జూలై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా వచ్చిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాల గురించి వివరించారు. పాత, కొత్త చట్టాల మధ్య వ్యత్యాసాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యాల చట్టం (ఐఈఏ) స్థానంలో భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలు గత సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. జూలై ఒకటికి ముందు జరిగిన నేరాలకు పాత చట్టాల ప్రకారం, ఆ తర్వాత జరిగిన నేరాలకు కొత్త చట్టాల ప్రకారం కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ ఉంటుందన్నారు.

**గంజాయిపై ఉక్కుపాదం**

యలమంచిలి పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు అదుపు చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయి నిరోధానికి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. పార్కులు, ఖాళీగా ఉన్న లేఅవుట్లు ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా నిఘా పెడతామన్నారు. యువత, కళాశాల విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి పోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నియంత్రణ విషయంలో ప్రజలు పోలీసులకు సమాచారం ఇస్తే మెరుగైన ఫలితాలు రాబట్టే అవకాశం ఉంటుందన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. పట్టణంలో ఆటోలు, ఇతర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తున్నారని, వాటిని నిర్దేశిత స్థలాల్లో నిలిపి ఉంచేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. హైవేపై వ్యభిచారం జరగకుండా చూస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పట్టణం మీదుగా భారీ లోడుతో వాహనాలు ప్రయాణించకుండా తమ కింది స్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సమావేశంలో యలమంచిలి సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్సై కె.పాపినాయుడు పాల్గొన్నారు.

## జూకి చేరిన కొత్త అతిథులు



స్కైరెల్ మంకీస్..



వన్యప్రాణులను వ్యాను నుంచి దించుతున్న సిబ్బంది

ఆరిలోవ (విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కుకు గురువారం సాయంత్రం కొత్త వన్యప్రాణులు చేరుకున్నాయి. జూ అధికారులు జంతు మార్పిడి విధానం ద్వారా కొత్త వన్యప్రాణులను కొంతకాలంగా పలు రాష్ట్రాల్లో జూ పార్కుల నుంచి ఇక్కడకు తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విశాఖ జూ అధికారులు గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్‌తో జంతుమార్పిడి ఒప్పందం కుదుర్చుకున్నారు. అక్కడ నుంచి నుంచి గ్రీన్ వింగ్డ్ మెకావ్ రెండు జతలు, స్కార్లెట్ మెకావ్స్ రెండు జతలు, మిలటరీ మెకావ్స్ రెండు జతలు, మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ రెండు జతలు, స్కైరల్ మంకీస్ రెండు జతలు, కామన్ మార్మోసెట్స్ రెండు జతలు, మీర్‌కాట్ ఒక జత, రెడ్ నెక్డ్ వాల్లబీ ఒక జత వన్యప్రాణులను విశాఖ జూకి తీసుకువచ్చారు. వాటిని ప్రత్యేక కంటైనర్లలో రోడ్డు మార్గం ద్వారా తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మ తెలిపారు. వాటికి బదులుగా ఇక్కడ నుంచి 2 మగ స్ట్రిప్డ్ హైనాలు, ఒక జత హాగ్‌డీర్, 4 పెయింటెడ్ స్టార్క్, 4 గ్రే పెలికాన్, 10 జతలు నక్షత్ర తాబేళ్లు, ఒక ఆడ ఘరియల్, 2 ఆడ జంగిల్ క్యాట్, 10 దాలెలు(7 మగ, 3 ఆడ), ఒక జత వోల్ఫ్, ఒక జత గౌర్ జాతులను పంపించనున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ పీసీసీఎఫ్ వాంతిప్రియ పాండే గురువారం జూని సందర్శించారు. కొత్తగా తీసుకువచ్చిన వన్యప్రాణులు, వాటి కోసం ఇక్కడ సిద్ధం చేసిన ఎన్‌క్లోజర్లను పరిశీలించారు. కొత్త వన్యప్రాణులను జాగ్రతగా తీసుకువచ్చిన జూ సిబ్బందిని ఆమె అభినందించారు.

**క్వారెంటైన్‌లో కొత్త వన్యప్రాణులు**

జూకి కొత్తగా తీసుకువచ్చిన వన్యప్రాణులు ఆరోగ్యంగా ఉన్నాయని క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వాటికి ఇక్కడ వాతావరణం అలవాటు కోసం కొద్ది రోజులపాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నామన్నారు. క్వారెంటైన్ అనంతరం సందర్శకుల కోసం జూలో ఎన్‌క్లోజర్లలో విడిచిపెడతామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు.



స్కైరెల్ మంకీస్..

మీడియం సల్ఫర్ కాకటూ..



స్కార్లెట్ మకావ్..

## క్లుప్తంగా

### నీట్ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి



బంద్‌లో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌వో సంఘాల నాయకులు

**అనకాపల్లి :** దేశవ్యాప్తంగా నీట్‌పరీక్షల్లో స్కామ్‌కు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అసమర్థ ఎన్‌టీఏను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ మాట్లాడుతూ నీట్ పరీక్షలు నీట్‌గా స్కామ్ చేసేసారని, అసమర్థ ఎన్‌టీఏ(నేషనల్ టెస్ట్ ఏజెన్సీ)ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అన్నారు. నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు తొలగించాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి మాట్లాడుతూ విద్యార్థి జీవితాలు రోడ్డున పడే పరిస్థితి లేకుండా గవర్నర్ చర్యలు తీసుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకులు హరీష్, సింహాద్రి, కుమార్, తరుణ్, రాజేష్, సందీప్, సతీష్, విష్ణు పాల్గొన్నారు.

### చోడవరంలో 'టీచ్ టూల్' శిక్షణ కార్యక్రమం



శిక్షణను సందర్శించిన అధికారులు

**చోడవరం రూరల్ :** చోడవరం బాలికోన్నత పాఠశాలలో 9 రోజుల పాటు జరిగే టీచ్‌టూల్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ నుంచి ప్రొఫెసర్ భాగ్యశ్రీ ఆకస్మికంగా సందర్శించారు. మూడు రోజుల శిక్షణ ఫీడ్ బ్యాక్‌ను తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతి గది పరిశీలన, బోధన నాణ్యతను పరిశీలించడానికి, మెరుగుపరచడానికి ఈ టూల్ రూపొందించబడిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంలో జిల్లా సమగ్ర శిక్ష సాహితి విద్యా కో ఆర్డినేటర్ శకుంతల, జిల్లా సైన్స్ ఆఫీసర్ కాళిదాసు, జిల్లా సహాయ కో ఆర్డినేటర్ నీతికా, చోడవరం మండల విద్యాశాఖాధికారి సింహాచలం, కోర్సు డైరెక్టర్ రామిరెడ్డి, మాస్టర్ ట్రైనీలు జగన్నాథరావు, ఉదయ్ భాస్కర్, బొంజిబాబు, సముద్రం, కుమార్, సతీష్, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి విగ్రహావిష్కరణ



కృష్ణదేవిపేట గ్రామంలో మైత్రీ గ్రంథాలయం వద్ద నూతన అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ



ఎస్పీ కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్

**గొలుగొండ :** పోలీసులు, సేవా కమిటీ, ప్రముఖుల ఆధ్వర్యంలో కృష్ణ దేవిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన అల్లూరి మైత్రీ గ్రంథాలయం ప్రస్తుతం ఎంతో గొప్పగా నడవడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. గ్రామంలో యువతతో పాటు అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి సమాధి ఉన్న ఈ ప్రాంతంలో మైత్రి గ్రంథాలయం వద్ద నూతనంగా 6 అడుగుల అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయడం, మహనీయుడైన అల్లూరి విగ్రహాన్ని తన చేతులు మీదుగా ప్రారంభం చేయడం చాలా ఆనందంగా ఉందని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ మోహన్, రూరల్ సీఐ హరి, గ్రంథాలయం నిర్మాణకర్త శర్మ మాస్టారుతో పాటు మైత్రి గ్రంథాలయం సభ్యులు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, డాక్టరు రాజశేఖర్, సర్పంచ్ లోచల సుజాత పాల్గొన్నారు.

**అదనపు ఎస్పీ నివాళి**

**అనకాపల్లి:** బ్రిటిష్ పాలకులను వెన్నులో దడపుట్టించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి



తిమ్మన్నపాలెంలో సీతారామరాజు అమ్మగారి ఊరులో జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు

ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి జయంతిని జరుపుకోవడం తెలుగు జాతికే కాకుండా దేశానికే గర్వకారణమని, భారత దేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన విప్లవ వీరుడని పేర్కొన్నారు. విప్లవాన్ని అణచివేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను హింసిస్తుండడంతో, ప్రాణ త్యాగానికి సిద్ధపడి 1924, మే 7న జిల్లాలో మంప గ్రామానికి సమీపాన లొంగిపోయి ఆంగ్లేయుల తూటాలకు తుదిశ్వాస విడిచారని ఆయన తెలిపారు. ఆయన పోరాటం మాత్రం శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, గణేష్, కుమారస్వామి, ఎస్‌ఐలు ప్రసాద్, శ్రీనివాస్, రామారావు, రఘువర్మ, సావిత్రి, దివ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉద్యమాలకే ఆదర్శం..**

**చోడవరం :** స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఉద్యమాలకే ఒక ఆదర్శనీయుడని నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. అల్లూరి అమ్మగారి ఊరైన చోడవరం మండలం తిమ్మన్నపాలెం గ్రామంలో ఆయన కుటుంబసభ్యుల మధ్య సీతారామరాజు జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు అమ్మగారి కుటుంబ వంశీకులైన మందపాటి నారాయణమ్మ, విజయశంకర నర్సింహరాజు ఇంటి వద్ద జయంతి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్యాలనాయుడు మాట్లాడుతూ మన్యం వీరుడుగా స్వాంతంత్య్ర ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు చూపిన వీర పరాక్రమాలు నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్క్ సంస్థ కార్యదర్శి ప్రసాద్, ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు టివి రమణ, దేముడు మాస్టారు, ప్రేమసమాజం మేనేజర్ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

# సచివాలయాల్లో సేవలు బంద్!

- వారం రోజులుగా మొరాయించిన సర్వర్
- ధ్రువపత్రాల జారీ ఆలస్యం కావడంతో ప్రజల అవస్థలు
- సర్వర్ పేరుతో సేవలను ప్రభుత్వమే నిలిపేసిందంటూ విమర్శలు
- గత ప్రభుత్వ హయాంలో ప్రతి పనీ సచివాలయ పరిధిలోనే..
- ఇప్పుడు సచివాలయాల పనితీరుపై సర్వత్రా ఆందోళన



గంభీరంలో సచివాలయం

**సాక్షి, విశాఖపట్నం/పెదగంట్యాడ:** మహాత్ముని ఆశయ సాధనలో భాగంగా పల్లెలకే పరిపాలన తీసుకొస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విశేష సేవలందించిన సచివాలయాలు మూగబోతున్నాయి. సర్వర్లు పనిచేయకపోవడంతో ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలోని సెక్రటేరియట్స్‌లో సేవలు అంతంతమాత్రంగానే అందుతుండటంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. గతంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేస్తూ సేవలన్నింటినీ వారి చెంతకే తీసుకొచ్చారు. ప్రజలకు 35 విభాగాలకు సంబంధించి 545 ప్రభుత్వ సేవలను అందించే కార్యక్రమంతో ప్రతి సమస్య కూడా సచివాలయ సిబ్బంది పరిష్కరించడంలో ముఖ్యభూమిక పోషించారు. దేశంలో కీలకమైన ఆధార్ సేవలు కూడా సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలు ఇబ్బందులకు దూరమయ్యారు. కానీ.. ప్రస్తుతం కథ మళ్లీ మొదటికొచ్చింది. సేవలందించిన సచివాలయాలు సైలెంట్‌గా మారిపోతున్నాయి. విశాఖ జిల్లాలో 607 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఇందులో జీవీఎంసీ పరిధిలో 554 వార్డు సచివాలయాలుండగా మిగిలిన మండలాల పరిధిలో 53 గ్రామ సచివాలయాలున్నాయి. వార్డులు, గ్రామాల్లో నివసించే రైతు నుంచి కూలీ వరకు అన్ని వర్గాలకు అవసరమైన సేవలను నిర్ణీత కాల వ్యవధిలో అందించాల్సిన ఈ కార్యాలయాల్లో ఇప్పుడు సర్వర్లు పనిచేయడం లేదనే సమాధానమే వినిపిస్తోంది.

**ప్రతి పనిలోనూ జాప్యం**

ఐదు రోజులుగా ఏపీ సేవా పోర్టల్‌కు సంబంధించిన సర్వర్ పనిచేయడం లేదంటూ తమ వద్దకు వస్తున్న ప్రజలకు సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్న సమయంలో వివిధ ధృవపత్రాలు అవసరమై ప్రజలు పెద్ద సంఖ్యలో సచివాలయాలకు వెళ్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం ఎలాంటి సర్టిఫికెట్స్ జారీ చేయడం లేదు. సర్వర్ పనిచేయడం లేదనే సమాధానమే ఎక్కడికి వెళ్లినా వినిపిస్తోంది. ఐదు రోజులైనా సాంకేతిక సమస్య పరిష్కరించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయాల వ్యవస్థ అంటే గిట్టని కొత్త ప్రభుత్వమే ఈ తరహా కుటిల రాజకీయాలకు పాల్పడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయాల్లో సేవలను నిర్వీర్యం చేస్తే క్రమంగా వాటిపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిపోతుందనీ.. తద్వారా వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన వ్యవస్థను ప్రజలు మర్చిపోతారని ప్రభుత్వం భావిస్తోంది. ఎవరి సిఫార్సులు లేకుండా, రాజకీయ జోక్యం లేకుండా, పైసా లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా ఉన్న ఊరు, వార్డుల్లోనే ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు, పథకాలందించిన సచివాలయాలపై రాజకీయం తగదని ప్రజలు అంటున్నారు. సచివాలయాలు లేకపోతే ఐదేళ్ల క్రితం రోజులు మళ్లీ వస్తాయేమోనన్న ఆందోళన కూడా ప్రజల్లో వ్యక్తమవుతోంది. చిన్న ధృవపత్రానికే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే రోజులు వస్తాయేమోనన్న భయం కూడా మొదలైంది. మరోవైపు సర్వర్ సమస్య పరిష్కృతమైతే సేవలు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు.

# యూపీఎస్సీ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత



అధికారులకు సూచనలిస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

- 7న ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షల నిర్వహణ

**మహారాణిపేట:** యూపీఎస్సీ ఈ నెల 7న నిర్వహిస్తున్న ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ నియమించిన పరిశీలకులు జిల్లాలోని పరీక్ష కేంద్రాలను శుక్రవారం పరిశీలిస్తారన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) పర్సనల్ అసిస్టెంట్స్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్‌ఐసీ) నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించిన ఈ నెల 7న పరీక్షలు జరుగుతాయన్నారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11.30 వరకు ఈపీఎఫ్‌వో పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈఎస్‌ఐసీ పరీక్ష ఉంటుందని, ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈ పరీక్షలకు 5,729 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యూపీఎస్సీ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులకు ఆయన పలు ఆదేశాలిచ్చారు. పరీక్షల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

### కిడ్నీ వ్యవహారంలో విచారణ ముమ్మరం

**సీతమ్మధార :** కిడ్నీలు ఏర్పాటు చేస్తానని చెప్పి రూ.10లక్షలు కాజేసిన సంఘటనపై ద్వారకా పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే వైద్యురాలు వాణి, ఆస్పత్రి అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ అనిల్‌పై కేసు నమోదు చేశారు. అనిల్‌ను సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ధర్మేంద్ర విచారణ చేశారు. కిడ్నీ వ్యవహారం ఎప్పటి నుంచి సాగుతుంది? ఇప్పటి వరకు ఇలా ఎంతమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు? అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. మురళీనగర్‌కు చెందిన సత్యనారాయణ గోపి.. తన భార్య శారద లక్ష్మి అనారోగ్యానికి గురికాగా..సీతమ్మధారలోని ఎస్.ఆర్.ఐ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టు డాక్టర్ వాణిని సంప్రదించగా..కిడ్నీలు పాడయ్యాయని వెంటనే మార్చాలని చెప్పడంతో పాటు..కిడ్నీల కోసం ఆస్పత్రి అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ అనిల్‌ను కలిస్తే ఏర్పాటు చేస్తాడని సూచించారు. దీంతో అనిల్‌ను కలవగా..రూ.27 లక్షలు ఇస్తే కిడ్నీలు ఏర్పాటు చేస్తానని చెప్పడంతో తొలి విడతగా రూ.10 లక్షలు చెల్లించారు. డబ్బులు తీసుకున్న తరువాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో గోపీ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

# పింఛన్ల పంపిణీలో ప్రొటోకాల్ ఉల్లంఘన

- అధికారులపై మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఫిర్యాదు

**నర్సీపట్నం:** పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి తనను ఆహ్వానించకుండా అధికారులు అవమాన పరిచారంటూ మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ కె.వి.ఎస్.ఎల్.వి.చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారికి గురువారం ఫిర్యాదు చేశారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఆకుల రేణుక, మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి వెంకటలక్ష్మి తనకు సమాచారం ఇవ్వకుండా టీడీపీ నాయకులతో పింఛన్లు పంపిణీ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమమైనప్పటికీ టీడీపీ నాయకులు సొంత డబ్బులిచ్చినట్లు వ్యవహరించారన్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

### పాముకాటుకు వృద్ధుడి మృతి



మృతి చెందిన రాములు (ఫైల్)

**ఎస్.రాయవరం :** తిమ్మాపురం శివారు నారాయపట్నం గ్రామంలో పాము కాటుకు గురై వృద్ధుడు మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు గురువారం తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయన్నారు. చెక్కా రాములు అనే వ్యక్తి గ్రామంలో ఇంటివద్ద పశువులకు గడ్డి వేస్తుండగా పాము కాటుకు గురైనట్టు చెప్పారు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న రాములును కుటుంబ సభ్యులు నక్కపల్లి 30 పడకల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాములు మృతి చెందినట్టు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

### ఆన్‌లైన్‌లో సిమ్ రీచార్జి అంటూ నగదు చోరీ

**అనకాపల్లి :** ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ సిమ్ రీచార్జి అంటూ ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 54,485 చోరీకి పాల్పడిన ఘటనపై గురువారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ శంకరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గవరపాలెం, బుద్ద ప్రకాశరావు వీధికి చెందిన కొణతాల రాజేంద్రప్రసాద్‌కు జూలై 1వ తేదీన ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ రీచార్జి చేస్తానని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడని సీఐ చెప్పారు. దీనికి ముందుగా రూ.19 చెల్లించాలని చెప్పటంతో రాజేంద్రప్రసాద్ రూ. 10 పంపించారు. అదే వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి మిగిలిన రూ. 9 పంపించాలని కోరడంతో వెంటనే పంపించినట్లు సీఐ తెలిపారు. అప్పటికే రాజేంద్రప్రసాద్ ఎస్‌బీఐలో ఫిక్సిడ్‌గా ఉన్న రూ.80 వేలలో రూ. 50 వేల నగదు, బ్యాంక్ సాధారణ అకౌంట్‌లో ఉన్న మరో రూ.4,485 చోరీకి గురైనట్లు గుర్తించి రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



### డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి రూ.10 వేల జరిమానా



కోర్టు ఆవరణలో వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు

**అనకాపల్లి :** పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ 9 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం ఆయన వాహనదారులతో మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులు 31 మందిపై కేసులు నమోదు చేసి, రూ.17,585 జరిమానా విధించినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

### ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం



ఏలేరు కాలువలో కొట్టుకువస్తున్న మృతదేహం

**నాతవరం:** గుర్తు తెలియని మృతదేహం ఏలేరు కాలువలో కొట్టుకు వస్తుండగా నాతవరం మండలం ఎం.బి.పట్నం శివారు ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ లాకులు వద్ద చిక్కుంది. మృతదేహం నీటిలో పైకి తేలి ఉండడంతో గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై నాతవరం ఎస్ఐ రామారావును అడగగా తమకు ఇంతవరకు మృతదేహానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మాకు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలిస్తామన్నారు.

### వీధి కుక్కను కాల్చి చంపిన ఇద్దరిపై కేసు నమోదు

**బుచ్చెయ్యపేట :** కొండపాలెం గ్రామంలో వీధి కుక్కను చంపిన కేసులో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కి తరలించినట్టు బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. కొండపాలెం గ్రామంలో వీధి కుక్క ఇటీవల పిచ్చెక్కి పలువురి నాటుకోళ్లు చంపి తినేయడమే కాక పలువురి మేకలు, గేదె పెయ్యిలను కరిచి గాయపరుస్తుంది. తన నాటుకోళ్లు తినేయడం వల్ల ఆగ్రహానికి గురైన కొండపాలేనికి చెందిన పెద్దాడ శ్రీనివాసరావు కుక్కను చంపాలని కేపీ అగ్రహారానికి చెందిన యాతగిరి నూకరాజును కోరాడు. నూకరాజు బుధవారం తన వద్ద ఉన్న నాటు తుపాకీతో వీధి కుక్కను చంపాడు. దీనిపై గ్రామ వీఆర్వో డి.వి.ఆర్ మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. లైసెన్స్ లేని నాటు తుపాకీతో కాల్చి చంపిన యాతగిరి నూకరాజును, కుక్కను చంపమని ప్రేరేపించిన పెద్దాడ శ్రీనివాసరావులను గురువారం అరెస్ట్ చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

### అగ్రిగోల్డ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

**అల్లిపురం:** అగ్రిగోల్డ్ సమస్యలపై ఎంపీలను, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలతో పాటు వినతిపత్రాలు అందజేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. అగ్రిగోల్డ్ సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని అధికారులు, అసోసియేషన్‌తో కలిపి వేయాలని కోరదామన్నారు.

# ఆస్తి కోసమే సోదరుడి హత్య

- సున్నం సతీష్ హత్య కేసులో నిందితులిద్దరికీ రిమాండ్
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ వెల్లడి



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

**యలమంచిలి రూరల్ :** సమాజంలో నేర ప్రవృత్తి కారణంగా మానవ సంబంధాలు రోజురోజుకూ దిగజారి పోతుండడం ఆందోళన కలిగిస్తోందని పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. యలమంచిలిలో గత నెల 27న ఆస్తి కోసం సొంత సోదరుడినే కిరాతకంగా హతమార్చిన ఘటన ఈ కోవలోకే వస్తుందన్నారు. గురువారం యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంచలనం కలిగించిన స్వర్ణకారుడు సున్నం సతీష్ కుమార్(38) హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 2న హతుడి తల్లి సున్నం రాజా నాగమణి తన కుమారుడు సతీష్ కుమార్ కనిపించడం లేదని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం నెంబరు 129/2024తో ఎస్ఐ పాపినాయుడు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశారన్నారు. కాగా 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని తులసీనగర్ వీఆర్వో మహమ్మద్ ఆరిఫ్ పట్టణ పోలీసులకు మరో ఫిర్యాదు ఇచ్చారు. హతుడు సున్నం సతీష్ కుమార్ సోదరులు సున్నం సాయి మనోజ్ కుమార్, దేవులపల్లి రాజేష్‌లు వీఆర్వో వద్దకు వచ్చి తమ సోదరుడు సతీష్‌కుమార్‌ను హత్య చేసి పాతిపెట్టినట్టు నేరాన్ని అంగీకరించి, వాంగ్మూలాలు ఇచ్చారని వీఆర్వో తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వ్యక్తి అదృశ్యం కేసును హత్య కేసుగా మార్చి చేసి యలమంచిలి సీఐ దర్యాప్తు ప్రారంభించారన్నారు. నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. పోలీసులు హతుడి మృతదేహాన్ని బయటకు తీయించి, శవ పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేయించారన్నారు. ఈ కేసును సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ చెల్లారావు, సిబ్బంది ఒక్క రోజులోనే ఛేదించారని, వారి కృషిని అభినందించారు. నిందితులపై రౌడీ షీటు తెరుస్తామన్నారు. కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి పూర్తి ఆధారాలను న్యాయస్థానం ముందుంచి నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా చూస్తామని డీఎస్పీ చెప్పారు.

**నిందితులకు 14 రోజుల రిమాండ్**

హత్య కేసులో అరెస్టు చేసిన ఏ1 గా సున్నం సాయి మనోజ్ కుమార్, ఏ2 గా దేవులపల్లి రాజేష్‌లను గురువారం సాయంత్రం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా వారిద్దరికీ న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో యలమంచిలి సబ్ జైలుకు తరలించారు.

# అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు

- నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి
- ఎ.కె.అగ్రహారంలో 8 ఎకరాల లేఅవుట్‌లో ప్రభుత్వ బోర్డుల ఏర్పాటు



లేఅవుట్ చుట్టూ ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మలు, ఐరన్ గ్రిల్స్ తొలగిస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు



అక్రమ లేఅవుట్ వద్ద ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, రెవెన్యూ అధికారులు

**నాతవరం:** అక్రమ లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.ఎస్.ఎస్.ఎన్.మూర్తి హెచ్చరించారు. నాతవరం పంచాయతీ శివారు ఎ.కె.అగ్రహారం గ్రామ రెవెన్యూ పరిధిలో వేసిన అక్రమ లేఅవుట్‌లో పంచాయతీ, రెవెన్యూ అధికారులు గురువారం బోర్డులు ఏర్పాటు చేశారు. లేఅవుట్ చుట్టూ వేసిన సిమెంటు స్తంభాలు, ఐరన్ గ్రిల్స్ సైతం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 10/2లో ఎనిమిది ఎకరాల 70 సెంట్ల విస్తీర్ణంలో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరాం ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేసి బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. జీవో 67 ప్రకారం డీటీసీపీ నుంచి అప్రూవల్‌తోపాటు పంచాయతీ పాలకవర్గం నుంచి ఆమోదం కలిగి ఉండాలన్నారు. అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌లో స్థలాలు కొనుగోలు చేస్తే చెల్లుబాటు కావన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, మండల సర్వేయరు బాలరెడ్డి, ఆర్ఐ హరి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, చినబాబు, వీఆర్వో బొత్సా శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అధికారిక వెబ్‌సైట్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాలి

కశింకోట : విద్యుత్ వినియోగదారులు ఈస్టర్న్ పవర్ యాప్, అధికారిక వెబ్‌సైట్ www.apeasternpower.com ద్వారా విద్యుత్ బిల్లులను నేరుగా చెల్లించుకోవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణారావు తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అనుసరించి గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా ఏపీఈపీడీసీఎల్ సంస్థకు విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం వినియోగదారులకు లేదన్నారు. దీని దృష్ట్యా ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ద్వారా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే యాప్‌లతో పాటు డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ వినియోగించి విద్యుత్ ఛార్జీలను చెల్లించవచ్చన్నారు. అలాగే తమ సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా వినియోగదారులు సకాలంలో విద్యుత్ ఛార్జీలు చెల్లించి సంస్థ పురోభివృద్ధికి దోహదపడాలని కోరారు.

### పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ



తల్లి కోసం ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కశింకోట : కశింకోటలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిలో భాగంగా గురువారం తల్లి కోసం ఒక మొక్క పేరిట నాయకులు మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణం పరిరక్షించబడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పిల్లలను కూడా ఇందుకు ప్రోత్సహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పొలాల్లో రైతులు కూడా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు దొడ్డి సన్నిబాబు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, వీహెచ్‌పీ ప్రతినిధులు శిష్టి అప్పారావు, వైఏ రాజు, గొంతిన రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

### వారపు సంతలో కూరల ధరలు ఇలా..

కశింకోట : వారపు సంతలో గురువారం ఉల్లిపాయ ధర పెరిగింది. టమాటా ధర తగ్గింది. ఉల్లిపాయ గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. అలాగే టమాటా ధర మాత్రం గత వారం కిలో రూ.60 ఉండగా, ఈ వారం రూ.50కి తగ్గింది. బంగాళాదుంప రూ.40 వద్ద ఉంది. బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, చేమ దుంప, బీట్రూట్, బీరకాయ రూ.60, గోరుచిక్కుడు రూ.80, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | -- | -- |
| రెండో రకం | -- | -- |
| మూడోరకం | 3,880 | 3,880 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మహారాజ | :రాజా |
| కల్కి2898 ఏడీ | :సత్యనారాయణ స్క్రీన్-1 |
| కల్కి2898 ఏడీ | :సత్యనారాయణ స్క్రీన్-2 |
| కల్కి2898 ఏడీ | :షిర్డిసాయి |
| కల్కి2898 ఏడీ | :పర్తిసాయి |
| మనమే | :వెంకటేశ్వర |
| రాజధాని రౌడీ | :శ్రీసత్య |
| కల్కి2898 ఏడీ | :రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 75 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



# పోరాట స్ఫూర్తి.. చైతన్య దీప్తి

విప్లవ వీరుడు అల్లూరి జయంతిని వాడవాడలా నాయకులు, సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల నేతలు ఘనంగా నిర్వహించారు. అతి చిన్న వయసులోనే బ్రిటిష్ వారిని గడగడలాడించిన అల్లూరి పోరాట స్ఫూర్తిని నేటి యువత పుణికి పుచ్చుకుని ముందడుగు వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరికి ఘనంగా నివాళులు అర్పించారు.


తుమ్మపాలలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



సంతబయలులో అల్లూరికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

- విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి
- ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని నాయకుల ఉద్బోధ

తుమ్మపాల : అతి చిన్న వయసులోనే స్వాతంత్య్ర పోరాటం ద్వారా ఉద్యమ కాంక్షను రగిలించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కర్రి బాబీ అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని మండలంలో తుమ్మపాల గ్రామంలో అల్లూరి విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి పోరాటాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబర్ వి.విశ్వేశ్వరరావు, పీలా తాతు నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మహనీయుడు అల్లూరి..**

కశింకోట : సంతబయలులోని సీతారామరాజు విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి అన్నారు. మాజీ సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు శిష్టి అప్పారావు, కార్యదర్శి వై.ఎ. రాజు, బీజేపీ, టీడీపీ, జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు. అడ్డాంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అప్పికొండ అప్పారావు, జిల్లా కార్యదర్శి అయినాల శ్రీను, పార్టీ అసెంబ్లీ సోషల్ మీడియా కో-కన్వీనర్ పంచాడ గంగరాజు, స్థానిక నాయకులు సీతారామరాజు, నరసింహరాజు, మణిరాజు తదితరులు పాల్గొన్నారు. గొబ్బూరులో టీడీపీ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



సంతబయలులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

**సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..**

సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతబయలులో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు దివాకర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

**మన్యం వీరునికి మనసారా నివాళి..**

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద ఇన్‌చార్జి డీసీహెచ్‌వో ఎస్. శ్రీనివాసరావు నివాళులర్పించారు. వైద్యాలయం వైద్యులు లక్ష్మణ శ్రీనివాస్, సునీల్, నాయుడు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక రైల్వే స్టేషన్ రహదారి గూడ్స్ రోడ్డులోని అల్లూరి విగ్రహం వద్ద పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు నివాళులర్పించారు. అధ్యక్షుడు ద్రాక్షారపు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు, కోశాధికారి కొండ మంచిలి నూకరాజు, సీపీఐ సీనియర్ నేతలు వైఎన్ భద్రం తదితరులు పాల్గొన్నారు. అక్కడే సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.
- సీపీఎం కార్యాలయలో అల్లూరి నివాళి అర్పించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, నాయకులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, డీడీ వరలక్ష్మి, పి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని మామిడిపాలెంలో రైతు కూలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అల్లూరికి నివాళి అర్పించారు. సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు, సంఘం నాయకులు కొండపల్లి దేముడు, రాజులు తదితరులు పాల్గొన్నారు.


సీపీఎం కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు


గూడ్స్‌షెడ్ వద్ద అల్లూరికి నివాళులర్పిస్తున్న మాణిక్యాలరావు


మామిడిపాలెంలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు తదితరులు


అల్లూరికి నివాళులర్పిస్తున్న రాజాన దొరబాబు తదితరులు

## రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావుకు ఘన స్వాగతం

ఎస్.రాయవరం : ఢిల్లీ రాజ్యసభ సమావేశాల్లో తొలిసారిగా గళం విప్పి ఉమ్మడి విశాఖ జిల్లాకు తిరిగి వచ్చిన రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విశాఖ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎంపీ అయిన బాబురావు గ్రామీణ ప్రాంతం సమస్యలు రాజసభలో ప్రస్తావించారని కొనియాడారు. ఎంపీ బాబూరావుకు స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతిరాజు, మామిడి చంటి, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు,కోరెడ్డి బాబి ఉన్నారు.


రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ నియామకం

అనకాపల్లి : స్థానిక గూడ్స్ రోడ్డు సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి నూతన ఉత్సవ కమిటీని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం నియమించారు. కమిటీ సభ్యులుగా దాడి వీఎస్ నారాయణ, బొండా రాజేష్, బి.కోటేశ్వరరావు, అనకాపల్లి మోహన్‌రావు, వై.ధనలక్ష్మి, బి.వెంకటచలపతిరావు, బి.లక్ష్మీ అప్పారావులను నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## నేడు పెంపుడు కుక్కలకు ర్యాబిస్ నిరోధక టీకాలు

అనకాపల్లి : స్థానిక గాంధీనగరం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జునోసిస్ డే సందర్భంగా శుక్రవారం పెంపుడు కుక్కలకు ఉదయం 9 గంటల నుంచి ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి : స్థానిక గవరపాలెంలో 18 మద్యం క్వార్టర్ బాటిల్స్ తరలిస్తున్న వై.గోపి గణేష్‌పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ శంకరరావు కథనం మేరకు గవరపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గోపి గణేష్ మద్యం క్వార్టర్ బాటిల్స్ తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

# రంగా సేవలు చిరస్మరణీయం


నక్కపల్లిలో రంగాకు నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నేతలు


పాయకరావుపేటలో వంగవీటి రంగా విగ్రహం వద్ద నివాళిలర్పిస్తున్న కాపు నాయకులు

నక్కపల్లి : కాపు నేత వంగవీటి మోహన్ రంగా జయంతిని గురువారం నక్కపల్లిలో అఖిలపక్ష నేతలు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగా చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి రంగా అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. కాపు సామాజిక వర్గం సంక్షేమం కోసం పాటు పడిన రంగా అడుగు జాడల్లో నడవాలని అన్నారు. నక్కపల్లి, ఉపమాక, ఉద్దండపురం, రమణయ్యపేట గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో కాపు నేతలు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్, మీగడ సత్తిబాబు, ముద్దాశ్రీను, కొప్పిశెట్టిబుజ్జి, నూకతాత, రవి పాల్గొన్నారు.

**పాయకరావుపేట :**

కాపునాడు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంగవీటి రంగా 77వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో గల జీవీఆర్ నగర్ వద్ద, అరట్లకోట గ్రామంలోను వున్న రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు ముఖ్య నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, దగ్గుపల్లి సాయిబాబా, యాళ్ళ వరహాలు పాల్గొన్నారు.


వంగవీటి రంగా జయంతి సందర్భంగా కోటవురట్ల- నర్సీపట్నం మెయిన్‌రోడ్డులో నిరాశ్రయులకు ఆహారాన్ని అందిస్తున్న యువకులు

**కోటవురట్ల :** మండలంలో వంగవీటి మోహనరంగా 77వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పేటకు చెందిన యువకులు రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కోటవురట్ల నుంచి నర్సీపట్నం వరకు మెయిన్‌రోడ్డులో ర్యాలీ చేసి అనాథలు, బిచ్చగాళ్లు, నిరాశ్రయులు, పెదబొడ్డేపల్లిలోని నిరాశ్రయ గృహంలోని పేదలకు ఆహారాన్ని అందించారు. పండ్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## ఘనంగా దుర్గాలమ్మ తల్లి పండగ

మునగపాక: ఉమ్మలాడ గ్రామంలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు విజయకుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు.


ఉమ్మలాడలోని దుర్గాలమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్యే విజయకుమార్

## ఘనంగా జీసస్ గాస్పల్ ట్రైబల్ పాస్టర్స్ ఫెలోషిప్

దేవరాపల్లి: జీసస్ గాస్పల్ ట్రైబల్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యక్రమం జీనబాడు జె.ఎస్.ఎం. చర్చిలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దైవ సేవకులు, విశ్వాసులు భారతదేశం, ప్రపంచ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిస్సీ మినిస్ట్రీస్ డైరెక్టర్ రెవ. బిషప్ గొర్లె టైటస్, గ్రేస్ టైటస్ దంపతులు పాస్టర్లను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం పాస్టర్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీసస్ గాస్పుల్ ట్రైబుల్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ యు. జాను, సెక్రటరీ దేవరాజు, వైస్ ప్రెసిడెంట్ ఇమ్మానియేల్, ట్రెజరర్ మింటప్పాల్, అడ్వైజర్ కె.దావీదు, జైరాజు, కాశీపురం సీయోను ప్రార్థన మందిరం సంఘ సభ్యులు పాల్గొన్నారు.


టైటస్, గ్రేస్ టైటస్ దంపతులతో బహుమతులు అందుకున్న పాస్టర్లు

## నీట్ పరీక్షలో అవకతవకలు నిరసిస్తూ బంద్



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శన

కశింకోట : కశింకోటలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలో అవకతవకలను నిరసిస్తూ గురువారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను నిర్వాహకులు మూయించివేశారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు దివాకర్, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమేష్, సభ్యులు లోకేష్, రాజు తదితరులు బంద్ జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రదర్శన చేశారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డయేరియా నివారణ, కీటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. తరణి ఐదేళ్లలోపు పిల్లలు అతిసార వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని, వారి పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విరోచనాలు అయినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తరచుగా పిల్లలకు ఇవ్వాలన్నారు. సమీపంలోని ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. దోమలు కుట్టకుండా తెరలు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది బృందంగా ఎస్సీ, బీసీ కాలనీల్లో పర్యటించి జ్వర పీడితులను గుర్తించి వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, సీహెచ్‌వో కె. అరుణ, ఏఎన్ఎం ఎన్. సత్యదేవి, ఆరోగ్య కార్యకర్త ఆర్‌వీవీ సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది

## డ్రైనేజీపై వేసిన మట్టి దిబ్బల తొలగింపు

అనకాపల్లి : జీవీఎంసీ 82వ వార్డు పరిధిలో గల రామాలయం వీధి డ్రైనేజీపై ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన మట్టిని గురువారం వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు, జెడ్పీ అయ్యప్పనాయుడు పరిశీలించి పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత జానకీ రామరాజు మాట్లాడుతూ డ్రైనేజీ ద్వారా మురుగు నీరు ప్రవహించే విధంగా ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని, డ్రైనేజీకి అడ్డంగా మట్టిదిబ్బలు వేసిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు చేపడతామని చెప్పారు. వీధిలో ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉన్నట్లయితే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. లేని పక్షంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు, ఆయా శాఖల అధికారులకు తెలపాలన్నారు. డ్రైనేజీకి అడ్డంగా మట్టిదిబ్బలు వేసి మురుగు నీటిని రహదారులపై ప్రవహించేలా చేయరాదన్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


డ్రైనేజీపై వేసిన మట్టిదిబ్బలను తొలగింపజేస్తున్న సునీత జానకీరామరాజు, జెడ్పీ అయ్యప్పనాయుడు

## ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగుల పాట్లు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో గుండె సంబంధిత వైద్య నిపుణులు రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇక్కడ గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు లేకపోవడంతో విశాఖ షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న గుండె వైద్య నిపుణుడు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రతి గురువారం చికిత్స అందించేలా ఒప్పందం జరిగింది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వైద్యుడు రావలసి ఉన్నప్పటికీ సాయంత్రం 4 గంటలకు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కొక్కసారి సాయంత్రం 5 గంటలకు కూడా వచ్చే పరిస్థితి ఉందని రోగులు చెబుతున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని సకాలంలో వైద్యం అందించాలని రోగులు కోరుతున్నారు.


గుండె జబ్బుల వైద్యుడి కోసం వేచి ఉన్న రోగులు

## జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తం

కోటవురట్ల : జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టరు ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక కేజీబీవీలో ఈ నెల 6న నిర్వహించనున్న వరల్డ్ జూనోసిస్ డే పై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల్లో రాబిస్, ఎబోలా, స్వైన్‌ఫ్లూ, జికా, ప్లేగూ, డెంగ్యూ ప్రధానమైనవన్నారు. ఈ వ్యాధులు జంతువుల నుంచి బాక్టీరియా ద్వారా మనుషులకు సోకుతుందన్నారు. ఇంట్లో పెంపుడు కుక్కల ద్వారా రాబిస్ వ్యాధి సోకుతుందని, ముందుగా యాంటీ రాబిస్ టీకా వేయడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. జీవ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ టీకా మొదటి మోతాదును 1885 జూలై 6 అందించారని, అందుకే అదే రోజున వరల్డ్ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద పెంపుడు జంతువులకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, శ్రీజోష్, ఉపాధ్యాయులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.


కోటవురట్ల కేజీబీవీలో జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్

## గంగాలమ్మ తల్లి గుడికి విరాళం

మునగపాక : మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి భక్తులు తమ వంతు సాయం అందజేస్తూ దైవభక్తిని చాటుకుంటున్నారు. గురువారం గంగాదేవిపేటకు చెందిన స్వర్గీయ మొల్లేటి అప్పారావు జ్ఞాపకార్థం భార్య వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.20,116 విరాళంగా అందజేశారు. సర్పంచ్ గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు,కాంట్రేగుల శ్రీనివాసరావు, యల్లపు నాగేశ్వరరావు,కాంట్రేగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దాతలు